## సదర్‌కు వేళాయె..



గుజరాత్ నుంచి సదర్ ఉత్సవాల కోసం తీసుకొచ్చిన దున్నపోతు

మణికొండ, నవంబర్ 11: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఆనవాయితీగా నిర్వహిస్తున్న యాదవుల సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నార్సింగిలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గుజరాత్ నుంచి తీసుకొచ్చిన మూడు దున్నపోతులను సదర్ ఉత్సవాల కోసం తెప్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో నార్సింగి వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున సదర్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాజేశ్‌యాదవ్ తెలిపారు.

## ఆనంద్‌కుమార్‌కు ఆయుర్వేద అవార్డు



సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ర్టానికి చెందిన డాక్టర్ ఇస్లావత్ ఆనంద్‌కుమార్ ఉత్తమ ఆయుర్వేద వైద్యుడిగా అవార్డు అందుకున్నారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ అవార్డును శనివారం ఢిల్లీలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఢిల్లీ మేయర్ డాక్టర్ షెల్లీ ఓబెరాయ్, ఆయుష్ అడిషనల్ కమిషనర్ ప్రదీప్ హాజరై అవార్డుతోపాటు ప్రశంసా పత్రంతో సన్మానించారు. తన విశిష్ట సేవలకు గాను ఈ గుర్తింపు రావడం సంతోషంగా ఉన్నదని ఆనంద్ తెలిపారు.

## విద్యావేత్త జక్కుల విజ్ఞతకు అవార్డు ప్రదానం



విజ్ఞతకు అవార్డు ప్రదానం చేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్ కోర్టు రిటైర్డ్ చైర్మన్ జస్టిస్ వామన్‌రావు

అబిడ్స్, నవంబర్ 11 : మనదేశంలో విద్యా అభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబ్దుల్‌కలాం అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్ కోర్టు రిటైర్డ్ చైర్మన్ జస్టిస్ వామన్‌రావు అన్నారు. నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బర్కత్‌పురాలోని నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కలాం ప్రఖ్యాత పండితుడు, కవి, మౌలాన అబ్దుల్ కలాం ఆజాద్ అని, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ మొదలైన భాషల్లో ప్రావీణ్యత సంపాదించారన్నారు. ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞత మాట్లాడుతూ ఆడపిల్లలకు న్యాయమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకువచ్చారని, అబ్దుల్ కలాం మార్గదర్శకత్వంలో యూజీసీని మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించారన్నారు. ప్రముఖ సంఘ సేవకులు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి శుభాకాంక్షలు

సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ) : చిమ్మ చీకట్లను చీల్చుతూ.. వెలుగులు పంచే దీపావళి వేడుక జీవితంలోనూ కొత్త వెలుగులు నింపుతుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు నగర మేయర్ నగరవాసులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.




విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు

# మీ ఇల్లు సక్కగ లేదు..

- ఇక్కడికి వచ్చి నీతులు చెబుతున్నారు
- ముందు కర్ణాటక రైతులను ఆదుకోండి
- ఏ ముఖం పెట్టుకొని ఇక్కడ ఓట్లు అడుగుతున్నారు
- ఆ రాష్ట్రంలో ఐదు గ్యారంటీలు అట్టర్ ఫ్లాప్ : మంత్రి హరీశ్‌రావు

దుండిగల్, నవంబర్ 11 : కర్ణాటకలో వ్యవసాయానికి సరిగా కరెంట్ అందక అక్కడి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఏ ముఖం పెట్టుకుని తెలంగాణలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఓట్లు అడుగుతున్నారని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నగర శివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బౌరంపేట్‌లోని కేఎల్‌హెచ్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఆపిల్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముందు తమ రాష్ర్టాన్ని చక్కదిద్దుకుని ఆ తర్వాత ఇక్కడ కాంగ్రెస్‌కు ఓటు వేయమని ప్రచారం చేయాలన్నారు. 'మీ ఇల్లు సక్కగా లేదు.. గానీ ఇక్కడ వచ్చి నీతులు చెబుతున్నారం'టూ మండిపడ్డారు. ఆరు నెలల కిందట కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ రాష్ట్ర ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం అక్కడ తాగునీరు లేదని, కరెంట్ అసలే లేదని పేర్కొన్న ఆయన.. అక్కడ ఎన్నికల్లో ఇచ్చిన ఐదు గ్యారెంటీలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయన్నారు. వ్యవసాయానికి కనీసం ఐదు గంటల కరెంట్‌ను కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అక్కడి పరిస్థితులను చక్కదిద్దుకోవడం వారికి చాత కావడం లేదు కానీ.. తెలంగాణలో ఏ ముఖం పెట్టుకుని ఇక్కడ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇటీవల డీకే శివకుమార్ తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంట్ ఇస్తున్నట్లు చెప్పారని, కానీ తెలంగాణలో 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను తాము సరాఫరా చేస్తున్నామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కర్ణాటక నేతలు తెలంగాణ ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు.

### తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది సీఎం కేసీఆరే..

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను ఇక్కడ ఎప్పటి నుంచో అమలవుతున్నాయన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే పాలనపరమైన కంట్రోల్ ఢిల్లీ, కర్ణాటక చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఢిల్లీ, కర్ణాటకకు నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కర్ణాటకతో కృష్ణా జలాలు, ఐటీ వివాదం వస్తే..మన రాష్ట్ర హక్కుల ఎవరూ కాపాడుతారన్నారు. ఇప్పటికే బ్రిజేశ్ ట్రిబ్యునల్ పంచాయతీ ఉందన్న మంత్రి.. కర్ణాటకను ధిక్కరించి మన రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ధైర్యం ఇక్కడి కాంగ్రెస్ నేతలకు ఉంటుందా...? కాళ్లు మొక్కేవాళ్లు, అడుగులకు మడుగులు ఒత్తేవాళ్లు తెలంగాణ ప్రయోజనాలు కాపాడతారా..? రాష్ట్ర ప్రజలు ఆలోచించాలన్నారు. కర్ణాటక ఇచ్చే టికెట్లు, డబ్బులు, ప్రచారంపై ఆధారపడిన ఇక్కడి కాంగ్రెస్ నేతలు.. భవిష్యత్‌లో ఇక్కడి ప్రజల ప్రయోజనాలు కాపారలేరన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది కేవలం సీఎం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. మంత్రి కేటీఆర్ చేసిన అద్భుత కృషితో ఐటీ రంగంలో కర్ణాటకతో మనం పోటీపడుతున్నామన్నారు. గడిచిన 9 ఏండ్లుగా ఐటీ ఉత్పత్తుల్లో, ఉద్యోగాల కల్పనలో బెంగళూరును దాటి మనం ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ర్టాన్ని కాంగ్రెస్ చేతిలో పెడితే మన ఐటీ పరిశ్రమను కర్ణాటక దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. దీనిని తెలంగాణ కాంగ్రెస్ నేతలు అడ్డుకోలేరని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని, బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

### ఐటీ ఉద్యోగాల కల్పనలో ప్రథమ స్థానంలో హైదరాబాద్..

అంతకు ముందు మంత్రి హరీశ్‌రావు కేఎల్‌హెచ్ యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనలో హైదరాబాద్ నగరం దేశంలోనే దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నదన్నారు. ఐదేండ్ల కాలంలో 6 లక్షల ఐటీ ఉద్యోగాలు, పారిశ్రామిక రంగంలో మరో 24 లక్షల ఉద్యోగాలు అందించాగలిగామన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చామని, వ్యవసాయరంగంలో సైతం రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. యువ ఓటర్లు వాస్తవాలను గ్రహించాలని, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఐటీ, వ్యవసాయ రంగాలను నంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వ సంస్థలే చెప్పాయని స్పష్టం చేశారు. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, ఫేస్‌బుక్ వంటి పరిశ్రమలు ఇక్కడ ఉండటం మనకు గర్వకారణమన్నారు. ఇతర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం తరుగుతుంటే మన వద్ద 7.7 శాతం పెరిగిందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను నిర్మించామని స్పష్టం చేశారు. 24 గంటల కరెంట్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఈ సందర్భంగా కేఎల్‌హెచ్ యూనివర్సిటీలో ప్రవేశం కోసం ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న కేఎల్ యూనివర్సిటీ ప్రవేశపరీక్షలు మెరిట్ విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎల్‌హెచ్ యూనివర్సిటీ వీసీ డా. పార్థసారథి వర్మ, బౌరంపేట్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా. కోటేశ్వర్‌రావు, అజీజ్‌నగర్ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ, యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డా. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్‌లో భూకంప బాధితులకు చేయూత



జూబ్లీహిల్స్, నవంబర్ 11: నేపాల్‌లో భూకంప బాధితుల సహాయార్థం పతంజలి ముందుకొచ్చింది. పతంజలి ఆధ్వర్యంలో 8 ట్రక్కుల నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను పంపించింది. ఈ మేరకు పతంజలి వ్యవస్థాపక చైర్మన్ స్వామి రామ్‌దేవ్ జీ మహారాజ్, ప్రధాన కార్యదర్శి ఆచార్య బాలకృష్ణ జీ మహారాజ్ పతంజలి ఫుడ్ పార్క్‌లో ట్రక్కులను జెండా ఊపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్ జీ మహారాజ్ మాట్లాడుతూ ఈ విపత్తు సమయంలో బాధిత కుటుంబాలను ఆదుకుంటుందన్నారు.

## బంజారాహిల్స్ పీఎస్‌లో చోటా పోలీస్



బంజారాహిల్స్ ఎస్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌తో అర్మాన్

బంజారాహిల్స్,అక్టోబర్ 11: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిదేండ్ల బాలుడు తాను పోలీస్ డ్రెస్‌లో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని కోరుకోవడంతో శనివారం అతడి కోరికను బంజారాహిల్స్ పోలీసులు తీర్చారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అర్మాన్ చావుస్ (8) ఏడాది కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ నగరంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా తనకు పోలీస్ డ్రెస్ ధరించాలని ఉన్నదని, పోలీస్‌స్టేషన్‌ను చూడాలని ఉందంటూ చెప్పడంతో ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బంజారాహిల్స్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో శనివారం అర్మాన్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సందడి చేశాడు.

## 'స్ప్రెడింగ్ జాయ్'.. పుస్తకావిష్కరణ

జూబ్లీహిల్స్, నవంబర్ 11: షార్జా పుస్తక మేళాలో జోయాలుక్కాస్ 'స్వీయ చరిత్ర' .. ''స్ప్రెడింగ్ జాయ్''.. పుస్తకాన్ని జోలీ జాయాలుక్కాస్, హార్పర్ కాలిన్స సీఈవో అనంత పద్మనాభన్ షార్జా పుస్తక మేళా బుక్ అథారిటీ సీఈవో అహ్మద్ బిన్ రక్కద్ ఏఐ అమెరితో పాటు బాలీవుడ్ నటీమణి కాజోల్, జోయాలుక్కాస్ బ్రాండ్ అంబాసిడర్ అజయ్ దేవగణ్‌లతో కలిసి ఆవిష్కరించారు. జోయాలుక్కాస్ 11 దేశాల్లో 160 షోరూమ్‌లతో 9 వేల మందికి పైగా ఉద్యోగులు.. 10 మిలియన్ కస్టమర్లతో 1 మిలియన్ డిజైన్స్‌తో నమ్మకమైన జ్యువెల్లరీ బ్రాండ్ వ్యాపారాన్ని అందిస్తుందన్నారు.

